

కుండపోత వర్షం
జిల్లాలోని వేమనపల్లి, కోటపల్లి మండలాల్లో కుండపోత వర్షం కురిసింది. పలు చోట్ల పత్తి పంటలు నీట మునిగాయి. తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచాయి. 8లో▸



మొక్కుబడిగా ప్రజావాణి
జిల్లాలోని మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రజావాణి మొక్కుబడిగా సాగుతోంది. అధికారులు నామమాత్రంగా పాల్గొనడంతో ప్రజలు ఎవరూ అటువైపు వెళ్లడం లేదు. 9లో▸

గరిష్టం/కనిష్టం
31.0 /26.0

వాతావరణం
ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. నైరుతి దిశగా ఈదురు గాలులు బలంగా వీస్తాయి. వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కొనసాగిన ఆర్కే-7 గని

శ్రీరాంపూర్: అటవీ అనుమతులు లేక సోమవారం నుంచి ఆర్కే-7గనిని మూసి వేస్తారని కార్మికులు ఆందోళనకు గురి కాగా.. యాజమాన్యం గనిని ఎప్పటివలే కొనసాగించింది. కార్మికులు ఉదయం విధులకు హాజరయ్యారు. రోజువారీ కార్యక్రమాలు కొనసాగాయి. మస్టర్ పడి కార్మికులు పని స్థలాలకు వెళ్లారు. మరోవైపు అటవీ లీజు రెన్యూవల్ కోసం కంపెనీ అధికారులు హైదరాబాద్‌లోని అటవీ అధికారులతో చర్చించడానికి వెళ్లారు. గనికి రెండు లీజులు ఉండడం, ఒక లీజు పూర్తి కావడం తెలిసిందే. లీజు ఉన్న మరో ఏరియాలో బొగ్గు ఉత్పత్తికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

గనిని సందర్శించిన నాయకులు

ఏఐటీయూసీ, హెచ్ఎమ్మెస్ నాయకులు ఉదయం గనిని సందర్శించి కార్మికులతో మాట్లాడారు. హెచ్ఎమ్మెస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ కార్మికులను కలిసి గనిని ఎట్టి పరిస్థితుల్లో మూసివేసేది లేదని, కార్మికులకు అండగా ఉంటామని అన్నారు. యాజమాన్యం మూసివేయాలని చూస్తే అడ్డుకుంటామని స్పష్టం చేశారు. యూనియన్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు టీ.సారయ్య తదితరులు పాల్గొన్నారు.

21న రైతు సదస్సు



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

మంచిర్యాలటౌన్: ఈ నెల 21న గోదావరిఖని సింగరేణి కమ్యూనిటీ హాలులో రైతు సదస్సు నిర్వహించనున్నట్లు సమతా సైనికదళ్ రాష్ట్ర నాయకుడు ముద్దమల్ల భార్గవ్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమతా సైనిక దళ్ రాష్ట్ర కమిటీ నాయకులతో కలిసి రైతు సదస్సు కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతన్నలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతూ ఆత్మహత్య చేసుకుంటున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలు పరిష్కరించకుండా, గిట్టుబాటు ధర కల్పించకుండా కాలయాపన చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆరోపించారు. రైతు సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు మార్షల్ దుర్గం నగేశ్, దుర్గా సిద్ధార్థ, రామ్మూర్తి, దుర్గం కుమార్, చంద్రగిరి శివప్రసాద్ పాల్గొన్నారు.

భావితరాల కోసం సేంద్రియ వ్యవసాయం



మాట్లాడుతున్న చెన్నమనేని పద్మ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రతీ రైతు భావితరాల కోసం సేంద్రియ వ్యవసాయం చేయాలని గో ఆధారిత రైతుమిత్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నమనేని పద్మ అన్నారు. సోమవారం హాజీపూర్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో హాజీపూర్ రైతు ఉత్పత్తి సంస్థ(ఎఫ్‌పీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆమె మాట్లాడారు. నేటి ఆధునిక వ్యవసాయంలో ఫర్టిలైజర్, క్రిమిసంహారక మందులు వాడి భూమి, నీరు, గాలితో పర్యావరణం కలుషితం అవుతోందని తెలిపారు. ఇంటి అవసరాల కోసం కనీసం ఐదు గుంటల్లో కాయగూరలు పండించాలని సూచించారు. ఈ సమ్మేళనంలో ఎఫ్‌పీసీ అధ్యక్షుడు మాధవరపు వినయ్‌ప్రకాశ్‌రావు, సలహాదారుడు గోనె శ్యాంసుందర్‌రావు, నాబార్డ్ డీడీఎం అబ్దుల్ రవూఫ్, ప్రకృతి వ్యవసాయ రైతు సురేందర్, డైరెక్టర్ పూస్కూరి శ్రీనివాసరావు, బొడ్డు శంకర్, బొలిశెట్టి తిరుపతి, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలం'



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలటౌన్: జిల్లాలోని ప్రజా సమస్యల పరిష్కారంలో ముగ్గురు ఎమ్మెల్యేలు విఫలమయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి విమర్శించారు. సోమవారం మంచిర్యాలలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుకు మంత్రి పదవిపై ఉన్న ఆసక్తి ప్రజా సమస్యల పరిష్కారంలో లేదని విమర్శించారు. మంచిర్యాల-అంతర్గాం బ్రిడ్జి నిర్మాణం ఊసేలేదని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులకు అనేక హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ నెరవేర్చకుండా మోసం చేసిందని అన్నారు. నాయకులు రజనీష్ జైన్, పెద్దపల్లి పురుషోత్తం, కొయ్యల ఏమాజి, అమర్‌రాజుల శ్రీదేవి, అందుగుల శ్రీనివాస్, బూస నర్సింహులు, ముదాం మల్లేశ్ పాల్గొన్నారు.

మాఫీ.. పరేషాన్..!



- రైతుల రుణమాఫీకి రేషన్‌కార్డుతో లింకు
- కుటుంబానికి రూ.2లక్షల వరకు..
- 2018 డిసెంబర్ 12నుంచి తీసుకున్న రుణాలకు వర్తింపు

మంచిర్యాలఅగ్రికల్చర్: రైతుల రుణమాఫీకి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలతో అన్నదాతల్లో పరేషాన్ మొదలైంది. భూమి ఉన్న ప్రతీ రైతు కుటుంబానికి రూ.2లక్షల వరకు మాఫీ వర్తిస్తుందని, 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9వరకు తీసుకున్న రైతులకు మాఫీ చేయాలని నిర్ణయించింది. రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోవాలని మార్గదర్శకాల్లో పొందుపర్చింది. దీంతో కొందరు రైతులకే లబ్ధి జరుగుతుండగా మరికొందరిని ఆందోళనకు గురి చేస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన గడువులో రేషన్‌కార్డులు లేని రైతులు చాలామంది రైతులు ఉన్నారు. గత ప్రభుత్వం పదేళ్లుగా కొత్త రేషన్‌కార్డులు ఇవ్వలేదు. రైతుల వారసులు పెళ్లి చేసుకుని తండ్రి పేరిట ఉన్న భూమిని వారసత్వంగా పొందినా రేషన్‌కార్డు లేదు. దీంతోపాటు ఒకే కుటుంబానికి రూ.2లక్షలు మాత్రమే మాఫీ అవుతుంది. రైతు, జీవిత భాగస్వామితోపాటు పిల్లలు ఆహార భద్రతకార్డులో ఉండడంతో వారసులు మాఫీకి దూరం కానున్నారు. ప్రభుత్వం పేర్కొన్న గడువులో జిల్లా నుంచి 94వేల మంది రైతుల వరకు ఉన్నారు. మార్గదర్శకాల కారణంగా 20నుంచి 30శాతం మంది రైతులు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. రూ.2లక్షల్లోపు నుంచి ఆరోహణ క్రమంలో మహిళా రైతులకు మొదట మాఫీ చేయాలని నిర్ణయించారు. రైతులు స్వల్పకాలిక పంటలకే రుణాలు ఏటా తీసుకుంటూ చెల్లిస్తూ ఉండాలి. మొదట రూ.2లక్షల కంటే తక్కువగా ఉన్నవి తర్వాత క్రమేపి పెంచుతూ మాఫీ సొమ్ము అర్హత గల రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ప్రతీ బ్యాంకులో పంట రుణాలు పొందిన రైతుల వివరాలు ప్రభుత్వానికి అందించాలి. ఈ వివరాల్లో రైతుల అర్హతలు గుర్తిస్తారు. జిల్లా వ్యవసాయ అధికారులు, నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్(ఎన్ఐసీ) ఈ రుణమాఫీ పథకానికి ప్రత్యేక ఐటీ పోర్టల్ ద్వారా బాధ్యతలు నిర్వహించనున్నారు. ప్రతీ బ్యాంకుకు వ్యవసాయ నోడల్ అధికారి, ఏదైనా సమస్యలు, ఫిర్యాదులు స్వీకరణకు మండల స్థాయిలో ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేసి 30రోజుల్లో పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నారు. రేషన్‌కార్డు లింకు లేకుండా రుణమాఫీ చేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

లింకు లేకుండా మాఫీ చేయాలి



రుణమాఫీకి రేషన్‌కార్డుతో లింకు లేకుండా మాఫీ చేయాలి. గతంలో అమ్మానాన్న పేరు మీద రేషన్ కార్డు ఉండేది. నాకు పెండ్లి అయింది. కానీ కొత్త రేషన్ కార్డు ఇంకా రాలేదు. రేషన్ కార్డుతో సంబంధం లేకుండా మాఫీ చేయాలి

– బీమరాజుల హరీష్, నెన్నెల

లోనుంది.. కార్డు లేదు



నా పేరుమీద నాలుగు ఎకరాల భూమి ఉంది. రూ.1.50 లక్షల లోను తీసుకున్న కానీ రేషన్‌కార్డు తొలగించిండ్రు. నేను వ్యవసాయం చేస్తున్న రైతునే. రేషన్‌కార్డు లింకుతో ముడిపెట్టి మాఫీ నుంచి తొలగించవద్దు.

– సుంకరి బాపు, నెన్నెల

నిబంధనలు పెట్టొద్దు



గతంలో చేసినట్లు కాకుండా ఒక్కసారే రుణమాఫీ చేయాలే. ఆ కార్డు ఈ కార్డు నిబంధనలు పెట్టొద్దు. భూమి ఉండి బ్యాంకు రుణాలతో పంట సాగు చేసుకుంటున్నాం.

– ఓదేలు, హాజీపూర్

రేషన్‌కార్డుతో ముడి పెట్టద్దు



మా నాన్న వారసత్వంగా మా ఇద్దరు అన్నదమ్ములకు భూమి వచ్చింది. నాకు వచ్చిన భూమి సాగు చేసుకుంటున్న. ఏటా బ్యాంకు నుంచి లోను తీసుకుంటున్నా. గత ఐదు సంవత్సరాల నుంచి కొత్త రేషన్‌కార్డే ఇవ్వలేదు. రుణమాఫీకి రేషన్‌కార్డుకు ముడిపెట్టి మాఫీ చేయకుండా ఉండద్దు.

– తోట సతీష్, నెన్నెల

తిరకాసు పెట్టద్దు



రుణమాఫీకి తిరకాసులు పెట్టి ఇబ్బందులు పెట్టద్దు. సాగు చేసుకునే టోళ్లందరికీ మాఫీ చేయాలి. బ్యాంకు లోనుతోనే సాగు చేసుకుంటున్నాం. కుటుంబంలో ఒక్కరికే అనడం కరెక్టు కాదు. కొడుకులకు పెండ్లి అయి వేరు ఉంటున్నా వాళ్లకు రేషన్‌కార్డులు లేవు.

– దుర్గం శంకర్, గ్రామం: కొత్తగూడెం, మం: నెన్నెల

కార్డు లేదని కాదనద్దు..



నాకు ఐదేకరాల సాగు భూమి ఉంది. గత పదేళ్లుగా లోను తీసుకుంటున్న కడుతున్న. రూ.1.60 లక్షల లోను తీసుకున్న మాఫీ అయితదని ఎదురు చూస్తున్నా. నాకు రేషన్ కార్డు లేదు. రేషన్ కార్డు ఉంటే మాఫీ అయితదంటున్నరు. కార్డుతో సంబంధం లేకుండా మాఫీ చేయలే.

– పెరుగు జోగయ్య, గ్రామం: మన్నెగూడెం, మం: నెన్నెల

అంగన్‌వాడీ సమస్యలపై ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి



ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఇంటి ముందు ధర్నాలో అంగన్‌వాడీ టీచర్లు

మంచిర్యాలటౌన్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు రిటైర్మెంట్ బెనిఫిట్లు, పింఛన్లు పెంచుతూ వీఆర్‌ఎస్ సౌకర్యం కల్పించాలని, కొత్త జీవో ఇవ్వాలని తెలంగాణ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ముగ్గురు ఎమ్మెల్యేల ఇళ్ల ఎదుట ధర్నా చేశారు. హైటెక్‌సిటీలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, గౌతమినగర్‌లో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఇళ్ల ఎదుట ఆందోళన, ధర్నా చేపట్టారు. అనంతరం యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భానుమతి, రాజమణి మాట్లాడుతూ ఆయాలకు పాత పద్ధతిలోనే ప్రమోషన్ ఇవ్వాలని, 24రోజుల సమ్మెలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలు అమలు చేయాలని కోరారు. హెల్పర్లకు రూ.లక్ష, టీచర్లకు రూ.2 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులకు ప్రకటించిన 5శాతం ఐఆర్‌ను అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు వర్తింపజేయాలని అన్నారు. మంత్రులను కలిసి విన్నవించినా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఎమ్మెల్యేల ఇళ్లు ముట్టడించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్, దూలం శ్రీనివాస్, గోమాస అశోక్, దేవదాస్, లక్ష్మణ్, విరోనిక, సబితా, అనురాధ, రాజేశ్వరి, శారద, సత్యవతి, భాగ్య, ప్రవీణ, పద్మావతి, సరిత, లక్ష్మి, మహేశ్వరి, స్వాతి, లావణ్య పాల్గొన్నారు.

అర్జీలు పెండింగ్‌లో ఉండొద్దు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలు పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని, తమ పరిధిలో లేని, కోర్టు వివాదాలు ఉన్న భూసమస్యల అర్జీలు పరిష్కరించలేమని తెలపాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో 62 దరఖాస్తులు అందాయని, క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరిస్తామని తెలిపారు.

- భీమారం మండలం బూర్గుపల్లి గ్రామానికి చెందిన జే.బాపు తన తండ్రికి కోటపల్లి మండలం సిర్సా గ్రామ శివారులో ఉన్న భూమిని ఆయన మరణానంతరం నిషేధిత జాబితాలో చేర్చారని, తొలగించి న్యాయం చేయాలని కోరాడు.
- వేమనపల్లి మండలం దస్నాపూర్ గ్రామస్తులు కబ్జాకు గురైన గిరిజన ఆశ్రమ పాఠశాల భూమి, పెద్ద చెరువు శిఖం భూమిని కాపాడాలని కోరారు.
- తెలంగాణ 398 స్పెషల్ టీచర్, పెన్షనర్ల సంఘం జిల్లా ప్రతినిధులు రూ.398 వేతనంపై పని చేసిన స్పెషలిస్టు టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంటు మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు.
- బెల్లంపల్లి మండలం బుచ్చయ్యపల్లి గ్రామానికి చెందిన రైతులు పంచాయతీ రోడ్డు నుంచి తమ భూముల వద్దకు 30ఏళ్లుగా వెళ్తున్న దారిని ఓ వ్యక్తి ఆక్రమించారని, నడవకుండా అడ్డుకుంటున్నారని, విచారణ జరిపి న్యాయం చేయాలని విన్నవించారు.
- నాలుగేళ్లుగా బోదకాలుతో బాధపడుతున్న తనకు పింఛన్ ఇప్పించాలని బెల్లంపల్లికి చెందిన సంకే శ్రీనివాస్ కోరాడు.

అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నరు..



కన్నెపల్లి మండలం జజ్జరవెల్లి గ్రామ పంచాయతీ పరిధి కొత్తపల్లి శివారులోని 89సర్వేనంబరులో భూమి కాస్తులో మా తాతల కాలంలో సాగు చేశారు. ఇప్పుడు మా పేరిట కాస్తు మార్చుకున్నాం. మొత్తం 34మంది రైతులకు కొందరు మాత్రమే సాగు చేసుకునేందుకు బెల్లంపల్లి ఆర్డీవో అనుమతి ఇచ్చారు. మిగతా రైతులు సాగు చేయకుండా అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారు.

– కొత్తపల్లి గ్రామ రైతులు, మం: కన్నెపల్లి

పంటలోను ఇవ్వడం లేదు..



ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇచ్చారు. పంట సాగు పెట్టుబడి కోసం బ్యాంకుకు వెళ్తే యూనియన్ బ్యాంకు అధికారులు లోను ఇవ్వడం లేదు. మాకు పంట పెట్టుబడి లోను ఇచ్చేలా చూడాలి.

– పెగడపల్లి పోడు రైతులు, తాండూర్

భూమి ఇప్పించండి



నా పేరిట ఉన్న 20గుంటల భూమిని నా పెద్ద కొడుకు అక్రమంగా పట్టా చేసుకున్నాడు. రైతుబంధు, రైతుబీమా తదితర పథకాలు, లోను వస్తుందని చెప్పి నాకు తెల్వకుండా పట్టా చేసుకుని మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. నా భూమి నా పేరిట పట్టా మార్పిడి చేయాలి.

– నర్సమ్మ, మంచిర్యాల

వైభవంగా మల్లన్న స్వామి కల్యాణం



ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

జైపూర్: మండలంలోని వేలాల మల్లన్న స్వామి ఆలయంలో సోమవారం ఒగ్గు పూజారుల నేతృత్వంలో సంప్రదాయబద్ధంగా పెద్దపట్నం వేసి ఖేతమ్మ భ్రమరాంభిక సమేత మల్లన్నస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అగ్నిగుండాల కార్యక్రమానికి సమీప గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మల్లన్నస్వామని దర్శించుకుని, కల్యాణోత్సవం తిలకించి అగ్నిగుండాల్లో నిప్పులపై నడిచారు. వానలు సంవృద్ధిగా కురిసి సిరిపంటలు పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఒగ్గు పూజారులు పూజలు చేశారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు కుటుంబ సమేతంగా మల్లన్న స్వామిని దర్శించుకున్నారు. స్థానిక ఎస్సై శ్రీధర్, ఆలయ ఈవో రమేష్, నాయకులు పాల్గొన్నారు.



మల్లన్నస్వామిని దర్శించుకుంటున్న ఏసీపీ వెంకటేశ్వర్లు దంపతులు, ఎస్సై శ్రీధర్

అమ్మ మాట..

- జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమాలు
- చిన్నారుల తల్లిదండ్రుల్లో భరోసా నింపేందుకే..
- ఈ నెల 20వరకు నిర్వహణ



మంచిర్యాలలోని అశోక్‌రోడ్డు అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమం

మంచిర్యాలటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంతోపాటు ప్రాథమిక విద్య అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నూతన విధానాలు అవలంబిస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది నుంచి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ విద్య, యూనిఫాంలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. జూన్ మొదటి వారంలో అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించగా ఈ నెల 15నుంచి 20వరకు 'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సులభ పద్ధతుల ద్వారా పిల్లల్లో విద్యాప్రమాణాలు మెరుగుపర్చేందుకు పూర్వ ప్రాథమిక విద్య అందించేలా ప్రతీ అంగన్‌వాడీ కేంద్రానికి పుస్తకాలు అందించింది. టీచర్లకు మూడు రోజులపాటు బోధనపై శిక్షణ పూర్తి చేసింది.

ప్రైవేటుకు పోటీగా ఉండేలా..

చిన్నారులను బడికి రప్పించేందుకు పలు ప్రైవేటు పాఠశాలలు ప్లేస్కూల్ పేరిట వేలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తూ చేర్చుకుంటున్నారు. ఆటపాటల మాట దేవుడెరుగు ఒత్తిడితో కూడిన విద్య అందిస్తున్నారు. తల్లిదండ్రులు కూడా ప్రైవేటులోనే చేర్పించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. చిన్నారుల తల్లిదండ్రులను ఆకట్టుకునేలా అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంతోపాటు పూర్వ ప్రాథమిక విద్య అందించడంపై అవగాహన కల్పనకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. స్నేహపూర్వక వాతావరణంలో చిన్నారులకు పౌష్టికాహారంతోపాటు అక్షరాలు, అంకెలు, బొమ్మలు, ఆటపాటలతో విద్యనందిస్తున్నారు. మారుతున్న అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆరు రోజులపాటు వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రెండున్నరేళ్లు పూర్తయిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చుకుంటున్నారు. ప్రైవేటులో చేరకుండా, ఒకవేళ చేరినా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేలా చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశం.

20వరకు కార్యక్రమాలు

'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను నమోదు చేయండి, వారి భవితకు పునాది వేయండి అనే నినాదంతో 15నుంచి 20వరకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. 15న సోమవారం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తల్లిదండ్రులు, పిల్లలతో కలిసి ర్యాలీలు నిర్వహించారు. 16న సర్పంచ్, ఏఎల్ఎంఎస్సీ సభ్యులు, వీవో/ఎస్‌హెచ్‌జీ, ఇతర ప్రజాప్రతినిధులతో సమావేశం, 18న రెండున్నరేళ్ల పిల్లల ఇళ్ల సందర్శన, అడ్మిషన్లు, ప్రీస్కూల్ సిలబస్, టైంటేబుల్, వర్క్‌బుక్స్, ప్రీస్కూల్ కిట్ మెటీరియల్, బడికి సంసిద్ధత, అభివృద్ధి అంచనా కార్డులు, కొత్త అడ్మిషన్లు చేపడుతారు. ఐదేళ్లు నిండిన వారు అంగన్‌వాడీ కేంద్రాల నుంచి వెళ్లిపోయేప్పుడు సర్టిఫికెట్ జారీ చేసి, ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించడం చేస్తారు. 19న స్వచ్ఛ అంగన్‌వాడీ పేరిట తరగతి గదిని సిద్ధం చేసి కేంద్రంతోపాటు, ఆవరణను పూర్తిగా శుభ్రం చేసి, అవసరం లేని వాటిని తొలగించడం, కేంద్రం ఆవరణలో మొక్కలు నాటడం, కిచెన్ గార్డెనింగ్ తదితర కార్యక్రమాలు చేపడుతారు. 20న ప్రీస్కూల్ విద్య ప్రాముఖ్యతను హైలెట్ చేయడం, తల్లిదండ్రులు, బంధువులు, గ్రామపెద్దలను ముఖ్య అతిథులుగా ఆహ్వానిస్తారు. ఇంటింటికి అంగన్‌వాడీ, కౌన్సెలింగ్ పుస్తకాన్ని ఉపయోగించి బాల్య సంరక్షణ, పూర్వ ప్రాథమిక విద్యపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం నిర్వహిస్తారు.

జిల్లాలో..

అంగన్‌వాడీ కేంద్రాలు	969
1-3 ఏళ్ల మధ్య వయస్సు పిల్లలు	6,735
3-6 ఏళ్ల మధ్య వయస్సు పిల్లలు	2,755

అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరేలా



చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి, పౌష్టికాహారం అందించడంతో పాటు పిల్లలపై ఎలాంటి ఒత్తిడి లేని, ఆటపాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్య చెబుతున్నాం. అంగన్‌వాడీ టీచర్లందరికీ శిక్షణ, పాఠ్యపుస్తకాలు ఇచ్చాం. ప్రీస్కూల్ చిన్నారులకు యూనిఫాం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రైవేటు పాఠశాలలకు చిన్నారులను పంపిస్తే ఒత్తిడితో కూడిన విద్యాబోధన మాత్రమే అందుతుంది. అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తే ఉచితంగా ఆటపాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యతోపాటు పౌష్టికాహారం అందిస్తున్నాం.

– చిన్నయ్య, జిల్లా సంక్షేమశాఖాధికారి, మంచిర్యాల

క్లుప్తంగా

క్యూట్ ఫలితాల్లో సత్తా


సమత

మంచిర్యాల అర్బన్: కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయిలో నిర్వహించిన సెంట్రల్ యూనివర్సిటీస్ ఎంట్రెన్స్ టెస్ట్ (క్యూట్) ఫలితాల్లో మంచిర్యాలకు చెందిన సమత సత్తా చాటింది. మంచిర్యాలలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం బీఎస్సీ (బీజెడ్సీ) పూర్తి చేసిన సమత ప్రవేశ పరీక్ష రాయగా హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం షార్ట్ లిస్టులో జనరల్‌లో 5వ ర్యాంకు సాధించింది. ఈ నెల 12న నిర్వహించిన హెచ్‌సీయూ కౌన్సెలింగ్‌లో సీటు సొంతం చేసుకుందని ప్రిన్సిపాల్ సుమతి తెలిపారు.

ఒకరి మృతికి కారణమైన డ్రైవర్‌కు జైలు

రామకృష్ణాపూర్: అజాగ్రత్తగా వాహనం నడిపి ఒకరి మృతికి కారణమైన హైదరాబాద్‌కు చెందిన లారీ డ్రైవర్ హమ్మద్ అలీకి మంచిర్యాల జూనియర్ సివిల్ జడ్జి సంపత్ మూడు నెలల సాధారణ జైలు, రూ.1000 జరిమానా విధిస్తూ సోమవారం తీర్పునిచ్చినట్లు పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. 2021 నవంబర్‌లో కుర్మపల్లి బస్‌స్టేజీ వద్ద హమ్మద్‌అలీ అజాగ్రత్తగా లారీ నడపటం వల్ల బైక్‌పై వెళ్తున్న ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. కోర్టులో సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టడంతో లారీ డ్రైవర్‌కు శిక్ష విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పెట్రోలింగ్ పోలీసుల ఔదార్యం

బెల్లంపల్లి: ఓ వ్యక్తిని అర్ధరాత్రి అత్యవసరంగా ఆస్పత్రికి తరలించి ప్రాణాపాయం నుంచి తప్పించి పెట్రోలింగ్ పోలీసులు ఔదార్యం చాటుకున్న ఘటన ఆదివారం రాత్రి బెల్లంపల్లిలో చోటు చేసుకుంది. కొత్తబస్టాండ్ ఏరియా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పాయింట్ వద్ద రాత్రి 12.30 గంటల ప్రాంతంలో వన్‌టౌన్ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఓ ఇంట్లో అలజడి రేగడంతో అప్రమత్తమై ఆరా తీశారు. ఆ ఇంట్లో నివాసం ఉంటున్న అడిచర్ల మహేష్ అనే వ్యక్తి గుండెనొప్పి వచ్చి కిందపడిపోయాడు. ఏఎస్సై మన్సూర్‌ఖాన్, డ్రైవర్ పూదరి సమ్మయ్య పరిస్థితి తీవ్రతను వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ దేవయ్య దృష్టికి తీసుకు వెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఎస్‌హెచ్‌ఓ బాధితుడికి సీపీఆర్ చేసి తక్షణమే పెట్రోలింగ్ వాహనంలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకు వెళ్లాలని ఆదేశించారు. ఆ ప్రకారంగానే పెట్రోలింగ్ సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి మహేష్‌ను ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. సకాలంలో బాధితుడిని ఆసుపత్రికి తీసుకురావడంతో ప్రాణాపాయం తప్పిందని వైద్యులు చెప్పారు.

ఐకేపీ కార్యాలయంలో మందు పార్టీపై విచారణ

భీమిని: మండల కేంద్రంలోని భారత మాత మండల సమాఖ్య కార్యాలయంలో ఈ నెల 12న శుక్రవారం రాత్రి ఐకేపీ ఏపీఎం పంజాల ప్రకాష్‌గౌడ్, మరి కొంత మంది వీఏవోలతో కలిసి మందు పార్టీ చేసుకున్నారనే అభియోగంపై సోమవారం అధికారులు విచారణ జరిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో విచారణ చేస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. ఎంపీడీవో గంగామోహన్ ఆధ్వర్యంలో కార్యాలయ పరిసరాలతో పాటు చుట్టు పక్కల వారిని విచారించారు.

రోడ్డెక్కిన వ్యాపారం

- కాంటాచౌరస్తా చుట్టూ జోరుగా కూరగాయల విక్రయాలు
- వీధుల్లో అంతర్గత రోడ్లనూ వదలని వ్యాపారులు
- చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు


మహ్మద్ ఖాశీం బస్తీకి వెళ్లే రోడ్డుపై కుప్పలుగా పెట్టి ఉన్న స్క్రాప్

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో వ్యాపారాల నిర్వహణ ఇష్టారాజ్యంగా సాగుతోంది. కూరగాయలు, ఇతర వ్యాపారాలు రోడ్డెక్కుతున్నాయి. వీటి కట్టడికి మున్సిపల్ అధికారులు చిత్తశుద్ధి ప్రదర్శించకపోవడంతో రోడ్డుపై రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. మున్సిపాలిటీలోని కాంటా చౌరస్తా పక్కన సమీకృత మార్కెట్ నిర్మాణం జరుగుతోంది. దాదాపు 90 శాతం వరకు పనులు పూర్తయ్యాయి. మార్కెట్ ప్రారంభించే వరకు పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న సింగరేణి స్థలంలో షెడ్ల కింద, కాల్‌టెక్స్ ఏరియాలో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద, ఏఎంసీ క్రీడా మైదానం ముందు, బెల్లంపల్లి బస్తీకి వెళ్లే మార్గంలో ఉన్న ఖాళీ స్థలాల్లో క్రయవిక్రయాలు జరపాలని సూచించారు. అయితే కొన్ని నెలల పాటు ఆ తీరుగానే విక్రయాలు సాగించిన వ్యాపారులు ఆతర్వాత క్రమంగా తమకు తోచిన రీతిలో చెల్లాచెదురయ్యారు. ప్రధానంగా కాంటా చౌరస్తా వద్ద, బెల్లంపల్లి బస్తీకి వెళ్లే మార్గంలో ఇరువైపులా గంపలు పెట్టుకుని క్రయ విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతుండగా మరోవైపు మారు బేరం వ్యాపారులు ఎండకు ఎండుతూ వానకు తడుస్తున్నారు. దుమ్మధూళి మింగి అనారోగ్యం పాలవుతున్నారు. మున్సిపల్ అధికారుల అవగాహన రాహిత్యం వల్లే కూరగాయల వ్యాపారులు రోడ్డెక్కాల్సి వచ్చిందనే విమర్శలు ఉన్నాయి.

షాపుల ముందు స్థలం అద్దెకు...

బజారు ఏరియాలోని ఎస్‌బీఐ బ్యాంకుకు వెళ్లే మార్గం వద్ద నుంచి మటన్ మార్కెట్ వరకు షాపుల ముందున్న ఖాళీ స్థలాలన్నీ నిబంధనలకు విరుద్ధంగా అద్దెకు ఇవ్వడం నిరాటంకంగా జరుగుతోంది. తోపుడు బండ్లు, గొడుగు కింద కూర్చొని, మంచాల మీద వస్తువులు, దుస్తులు, కూరగాయలు, పండ్లు పెట్టుకుని అమ్ముకోవడానికి వీధి వ్యాపారులకు అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు షాపుల యాజమానులు రోజువారీగా లెక్కకట్టి డబ్బులు వసూలు చేస్తుండగా మరికొందరు నెల ప్రాతిపదికన గంపగుత్త కిరాయి మాట్లాడుకుని చెల్లింపులు చేస్తున్నారు. తమది కాని ఖాళీ స్థలాన్ని షాపుల యాజమానులు వ్యాపారంగా మార్చుకుంటున్నారు. కొన్ని నెలల క్రితం అప్పటి కమిషనర్ మల్లారెడ్డి ఫుట్‌పాత్‌ను ఆనుకుని నిర్వహించే షాపులను తొలగించగా ముడుపులు ముట్టజెప్పి మళ్లీ పాత పద్ధతిలోనే అద్దె విధానాన్ని కొనసాగిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈకారణంగా ఫుట్‌పాత్‌పై బజారు ఏరియాలో బైక్‌లు ఇతర వాహనాలు పార్కింగ్ చేసే అవకాశాలు లేకుండా ఉన్నాయి. కాగా మటన్ మార్కెట్ నుంచి పాత బస్టాండ్ చౌరస్తా వరకు మురికి కాలువను ఆక్రమించి కొందరు షాపుల యాజమానులు శాశ్వత నిర్మాణాలు చేపట్టినా పట్టించుకునే అధికారులు, ప్రజా ప్రతినిధులు కానరాకుండా ఉన్నారు.

ఆక్రమణకు గురవుతున్న అంతర్గత రోడ్డు

బజారు ఏరియాలో ఉన్న రోడ్‌నంబర్ 1,2,3లలో అంతర్గత రోడ్డు ఫుట్‌పాత్‌ను కానరాకుండా షాపుల నిర్వాహకులు వస్తువులు ఉంచుతున్నారు. ఈ కారణంగా అంతర్గత రోడ్డు ఆక్రమణకు గురవుతోంది. సెంట్‌భూమి ఖాళీగా కనిపించకుండా వ్యాపారులు వస్తు సామగ్రిని ఉంచి క్రయవిక్రయాలు సాగిస్తుండటం చర్చనీయాంశమవుతోంది. మహ్మద్ ఖాశీం బస్తీకి వెళ్లే అంతర్గత రోడ్డుపై స్క్రాప్ సామగ్రి ఉంచుతున్నా అధికారులు శ్రద్ధపెట్టడం లేదు. కొందరికి జరిమానాలు విధించినా పద్ధతిలో మార్పు రావడం లేదు. ఇలా మున్సిపాలిటీలో షాపుల నిర్వహణ అడ్డగోలుగా సాగుతుండటం, ఫుట్‌పాత్, ఖాళీ స్థలాలను కిరాయికి ఇవ్వడం వ్యాపారులకు పరిపాటిగా మారింది. వెంటనే నివారణ చర్యలు తీసుకుని ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై వివరణ కోరేందుకు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లును 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మంచిర్యాలఅగ్రికల్చర్: పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ ఆవరణలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కలెక్టర్ మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు 20 లక్షలు, సింగరేణి సంస్థకు 7 లక్షలు, ఆటవీ శాఖకు 9 లక్షలు, మున్సిపాలిటీలకు 7.50 లక్షలు, ఇతర శాఖలకు లక్ష మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు.

ఇంటింటా ఇన్నోవేటర్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వం చేపట్టిన ఇంటింటా ఇన్నోవేటర్–2024 కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజా ఉపయోగకరమైన ఆవిష్కరణలను ప్రోత్సహించడం జరుగుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, డీఈవో యాదయ్య, సైన్స్ అధికారి మధుబాబు, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో కలిసి ఆయన మాట్లాడారు. అద్భుతమైన ఆలోచనలు, ప్రాజెక్టులు రూపొందించిన అన్ని వర్గాల ఆవిష్కర్తల నుంచి ఆవిష్కరణలు స్వీకరించడం జరుగుతుందన్నారు. గొప్ప ఆవిష్కరణను ఎంపిక చేసి ఆగస్టు 15న అవార్డు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

వృద్ధ దంపతులను కలిసిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

వేమనపల్లి: మండలంలోని జక్కెపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగ వృద్ధ దంపతులు తలండి రాజయ్య–బుచ్చక్క దీన స్థితిపై 'అయ్యా ఆసరా ఇవ్వరా' అనే శీర్షికన ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎంపీడీవో దేవేందర్ రెడ్డి ఆదేశాలతో జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీ నారాయణ, పంచాయతీ కార్యదర్శి హరినాథ్ సోమవారం గ్రామానికి వెళ్లి వృద్ధ దంపతులను కలిశారు. రాజం కళ్లు కనిపించని దివ్యాంగుడు. కానీ అతనికి సదరం సర్టిఫికెట్ లేదు. ఆధార్‌కార్డు ప్రకారం 63 ఏళ్ల వయస్సు మాత్రమే ఉంది. భార్య బుచ్చక్కకు సైతం ఆధార్‌కార్డు ప్రకారం 57 మాత్రమే ఉండటంతో పెన్షన్‌కు అర్హత లేనట్లుగా గుర్తించారు. దీంతో ఆసరా పెన్షన్ వారికి అందని ద్రాక్షగా మారింది. అధికారులే సదరం క్యాంపునకు పంపించనున్నట్లు సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీ నారాయణ తెలిపారు.


వృద్ధురాలితో మాట్లాడుతున్న కార్యదర్శి

'రాష్ట్ర కమిటీతో ఎలాంటి సంబంధం లేదు'

బెల్లంపల్లి: కుమురంభీం ఆసిఫాబాద్‌జిల్లా కాగజ్‌నగర్‌లో ఈనెల 14న జరిగిన సమావేశంలో ఎంపిక చేసిన రాష్ట్ర కమిటీతో తమ జిల్లా కమిటీకి ఎలాంటి సంబంధంలేదని ఆదివాసీ కోలవార్ (మన్నెవార్) సేవా సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు కమ్మరి భీమయ్య తెలిపారు. సోమవారం బెల్లంపల్లిలోని నూతన సంఘ భవనంలో జిల్లా కమిటీ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆదివాసీ కోలవార్ సమాజంలో కొంతమంది చొరబడి స్వార్థపర ఆలోచనతో తమజాతిని విచ్ఛిన్నం చేయడానికి యత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ముప్‌పై ఏళ్ల నుంచి సంకె కిష్టయ్య, బుర్స పోచయ్య జాతికోసం ఎన్నో పోరాటాలు చేశారని, తామంతా వారి నాయకత్వంలోనే పని చేస్తామన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి సిడాం శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంబి బాపు, జిల్లా ఉపాధ్యక్షుడు తుంగెడ కన్నయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతపురి మధు, కార్యదర్శి గోలిశెట్టి రాజన్న, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భీమయ్య

న్యాయం కోసం మహిళ ఆందోళన

దండేపల్లి: ఏలూరు జిల్లా ఉంగుటూర్ మండలం, కైకరం గ్రామానికి చెందిన సౌజన్య దండేపల్లి మండలం కొండాపూర్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్‌ను 2013లో ప్రేమ వివాహం చేసుకుంది. ఖమ్మంలోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసే సమయంలో ప్రేమించుకున్నారు. వీరికి పదేళ్ల బాబు ఉన్నాడు. అయితే తన భర్త తనను కాదని మరో పెళ్లి చేసుకున్నాడని, పెళ్లయిన ఏడాది తర్వాత నుంచి తన కాపురంలో వివాదాలు తలెత్తాయని, దీనికంతటికి తన ఆడపడుచే కారణమని ఆరోపిస్తూ సోమవారం దండేపల్లిలో ఆడపడుచు ఇంటి ఎదుట కుమారుడితో కలిసి ఆందోళనకు దిగింది. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేసింది. ఆసమయంలో ఇంటివద్ద ఆడపడుచు లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. ఈ విషయమై ఎస్సై ఉదయ్‌కిరణ్‌ను సంప్రదించగా 2023లో ఏలూరు జిల్లా చేబ్రోలో పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. మెయింటనెన్స్ కేసు కూడా వేసినట్లు బాధితురాలు తమకు చూపించిన డాక్యుమెంట్లలో ఉందన్నారు. ఈ విషయంలో లీగల్‌గా వెళ్లడం మంచిదని బాధితురాలికి నచ్చజెప్పినట్లు తెలిపారు.


ఆందోళన చేస్తున్న మహిళ

ఆర్కే 7 గనికి అనుమతులివ్వాలి

మంచిర్యాలటౌన్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 7 గనికి బొగ్గు ఉత్పత్తి చేసుకునేలా అటవీశాఖ అధికారులు అనుమతి ఇవ్వాలని, సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ, వివిధ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం అటవీశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా మాట్లాడుతూ శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఆర్కే 7 గనికి ల్యాండ్ లీజును పొడిగించాలని కోరినా అనుమతులు ఇవ్వడం లేదన్నారు. దీంతో గనిలో బొగ్గు ఉత్పత్తిని నిలిపివేయాలని నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి సామాజిక బాధ్యతతో అడవులను పెంపొందించేందుకు, రక్షించేందుకు కొన్ని లక్షల మొక్కలను హరితహారం, వన మహోత్సవాల పేరుతో నాటి పరిరక్షిస్తుందన్నారు. ఆ గనిలో పనిచేస్తున్న 1400ల మంది కార్మికులను యాజమాన్యం ఇతర గనులకు, ఇతర ప్రాంతాలకు బదిలీ చేసే అవకాశం ఉందని, కార్మికుల కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయని, ఆర్‌కె 7 గనిలో ఉత్పత్తి చేసుకునేలా అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మంచిర్యాల పట్టణ కార్యదర్శి ఖలీందర్ ఖాన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, నాయకులు అఫ్రోజ్‌ఖాన్, సారయ్య, రాజ్‌కుమార్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 7గని ఫారెస్టు లీజు అనుమతి త్వరగా ఇప్పించాలని కోరుతూ గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ ఎస్కే బాజీసైదా ఆధ్వర్యంలో నస్పూర్ కలెక్టరేట్‌లో కలెక్టర్ కమార్ దీపక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2020 నాటికి ఆర్కే 7 గనికి ఫారెస్టు అనుమతి ఉందని, దానికి ఎక్స్‌టెన్షన్ చేయడం కోసం అటవీ శాఖ అధికారులకు 2018 లోనే కంపెనీ లేఖలు పంపిందన్నారు. కానీ అటవీశాఖ అధికారులు ఇప్పటిదాకా అనుమతించలేదన్నారు. గనిలో సుమారు 1400 మంది కార్మికులు పనిచేస్తున్నారని వారంతా నేడు ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, బ్రాంచ్ ఏరియా కార్యదర్శి మారపల్లి సారయ్య, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, యూనియన్ నాయకులు సత్తయ్య, రాజ్‌కుమార్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కుండపోత వర్షం

- మళ్లీ తెగిన లోత్‌ఒర్రె వాగు బ్రిడ్జి
- కూలిన ఇళ్లు, నీటమునిగిన పంటలు


కోటపల్లి: నక్కలపల్లి వెళ్లేదారిలో దెబ్బతిన్న వంతెన

వేమనపల్లి/కోటపల్లి: జిల్లాలో రెండు రోజులుగా కుండపోత వర్షం కురుస్తోంది. కోటపల్లి మండల నక్కలపల్లికి వెళ్లే ప్రధాన రహదారిపై లోత్‌ఒర్రె వాగుపై ఉన్న వంతెన వరద ఉధృతికి కొట్టుకుపోయింది. వేమనపల్లి మండలంలో తెలంగాణ రాష్ట్రలోనే అత్యధిక వర్షపాతం 15.9 సెంటిమీటర్లు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. దీంతో మండలంలోని వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. నీల్వాయి, మామడ మార్గమధ్యలో ఉన్న ఒర్రెలో వరద ఉధృతికి తాత్కాలిక రోడ్డు తెగిపోయి రాకపోకలు నిలిచిపోయాయి. మండల కేంద్రంలోని బొగుడగూడంకు చెందిన గొండె రామన్న, నాగుల వెంకటయ్య ఇళ్లతో పాటు నీల్వాయిలోని అల్లూరి ధర్మయ్య, చెన్నూరి బాలాజీ, గురుండ్ల నాందేవ్ ఇళ్లు కూలిపోయాయి. వివిధ గ్రామాల్లో పత్తి, పామాయిల్ తోటలు నీట మునిగాయి. భారీ వర్షాలు ఉన్నందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి హెచ్చరించారు.


వేమనపల్లి:తెగిపోయిన మామడ తాత్కాలిక రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి


వేమనపల్లి:ఎంచపాయలో మునిగిన పత్తిచేను


వేమనపల్లి: నీల్వాయిలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న కార్యదర్శి

మూగజీవాల ఆరోగ్యం జాగ్రత్త

- ఎప్పటికప్పుడు పశువులను పరిశీలించాలి
- పశువైద్యాధికారి శ్రీనివాస్


మేత మేస్తున్న పశువులు


శ్రీనివాస్, పశువైద్యాధికారి, కత్తెరసాల

చెన్నూర్‌రూరల్: వర్షాకాలంలో మూగజీవాల ఆరోగ్యంపై రైతులు కనీస అవగాహన కలిగి ఉండాలి. తరచూ వాటి ఆరోగ్య స్థితిగతులను పరిశీలిస్తుండటం ద్వారా మరణాలు సంభవించకుండా కాపాడుకోవచ్చు. ఈ మేరకు పశువుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కత్తెరసాల పశువైద్యాధికారి శ్రీనివాస్ సలహాలు, సూచనలు ఇచ్చారు.

మానని గాయాలకు చికిత్స

కొన్ని సందర్భాల్లో పశువులకు పాత గాయాలు మానకుండా ఇబ్బంది పెడుతూ ఉంటాయి. అలాంటప్పుడు మరగబెట్టిన ఉప్పు నీటితో లేదా గోరు వెచ్చని నీటితో గాయాన్ని శుభ్రం చేయాలి. ఆ తరువాత ప్రొవిడిన్ అయోడిన్ ద్రావణాన్ని లేదా ఆయింట్‌మెంట్ పూయాలి. గాయానికి పురుగులు పడితే కర్పూర తైలం 15 నుంచి 20 నిమిషాలు పట్టించి తీస్తే ఊపిరాడక పురుగులు వాటంతట అవే బయటకు వస్తాయి. ఆ వెంటనే గాయానికి యాంటిసెప్టిక్ ద్రావణాన్ని లేదా ఆయింట్‌మెంట్ పూయాలి. ఈగలు వాలకుండా గాయం చుట్టూ వేప ముద్ద నూరి కర్పూర మిశ్రమాన్ని పూయాలి.

కాడి పుండ్లు :

బండ్లు, నాగలిలాగే పశువుల్లో సరైన జోడు లేకపోతే మెడ దగ్గర చర్మం కింది భాగంలో రాపిడి వల్ల పుండ్లు ఏర్పడుతాయి. ఈ ప్రదేశంలో రోజుకు మూడు సార్లు 15 నిమిషాల పాటు చల్లని నీటిని ధారగా పోయాలి. కమిలిన భాగం బాగా వాచి గట్టి పడితే అయోడిక్స్ ఆయింట్‌మెంట్ పూసి గోరువెచ్చని నీటితో కాపడం పెట్టాలి. అది పగిలిన తర్వాత చికిత్స అందించాలి. వాపు తగ్గే వరకు పశువులకు విశ్రాంతి ఇవ్వాలి. అప్పటికీ ఫలితం కనిపించకపోతే పశువైద్యులను సంప్రదించాలి.

బొడ్డువాపు :

దూడ పుట్టిన సమయంలో సరైన శుభ్రత పాటించకుండా బొడ్డు కత్తిరిస్తే బొడ్డు దగ్గర వాపు వస్తుంది. వాపు ఉంటే అయోడిక్స్ ఆయింట్‌మెంట్ పూసి రోజుకు మూడు సార్లు 15 నిమిషాల పాటు కాపడం పెట్టాలి. ఒకవేళ వాపు మెత్తబడి పగిలి చీము కారుతుంటే గోరువెచ్చని నీటితో శుభ్రంగా కడిగి బొడ్డుచుట్టూ వేపనూనె రాసి ఆస్పత్రికి తీసుకెళ్లాలి. పశువుల కంటికి గాయమైనప్పుడు కన్ను మూసుకుపోవడం, కళ్ల వెంట నీరు కారడం వంటి లక్షణాలు కనబడతాయి. గాయం మానేందుకు కొంచెం బోరిక్ పౌడర్‌ను నీటిలో కలిపి గాయమైన కన్ను భాగాన్ని మూడు పూటలా కడగాలి. కొమ్ములు ఊడితే చల్లని నీటితో శుభ్రంగా కడిగి పటిక పొడి చల్లి చల్లని బట్టతో గట్టిగా కట్టుకట్టాలి. ఒకవేళ కొమ్ము చివరి భాగం, మధ్యభాగం లేదా మొదలు దగ్గర విరిగితే పైన చెప్పిన చికిత్స అందించి పశువైద్యున్ని సంప్రదించాలి.

కాళ్ల బెణుకు :

పశువుల్లో కాళ్ల బెణుకు ఉంటే ముందుగా వాటికి విశ్రాంతి ఇవ్వాలి. బెణికిన చోట మొదటి రెండు రోజులు రోజుకు మూడుసార్లు చల్లని నీరు లేదా ఐస్ గడ్డను ఉంచాలి. అప్పటికీ తగ్గకపోతే గోరువెచ్చని నీటితో కాపడం పెట్టాలి. నూనెలో కర్పూరం కలిపి రోజుకు నాలుగుసార్లు మర్దనం చేయాలి. ఏదైనా తగిలి పశువుల ఎముకలు విరిగితే కదలకుండా ఉంచి విరిగిన చోట నాలుగు వైపులా కొంతభాగం వరకు పలుచని వెదురుబద్దను అమర్చాలి. ఆపై శుభ్రమైన గుడ్డతో కట్టి పశు వైద్యులను సంప్రదించాలి.

కడుపు కుట్టు :

పశువులు మేత బాగా మేసి తగినంత నీరు తాగకపోతే అరల పొట్ట సరిగా పని చేయక కడుపు కట్టు వస్తుంది. ఇలాంటి సందర్భాల్లో పశువులు నెమరు వేయవు. పేడ పింటికలుగా వస్తుంది. ఎడమ డొక్కను నొక్కితే సొట్టపడి తిరిగి యధాస్థితికి రాదు. ఈ క్రమంలో 5 గ్రాముల శొంటిపొడిని రెండు లీటర్ల ఉప్పు నీటిలో కలిపి తాగించాలి. ఒక్క రోజులో తగ్గక పోతే దాణా పెట్టకుండా పావు లీటరు ఆముదం తాగించాలి. రెండు రోజుల్లో నయం కాకపోతే పశు వైద్యులను సంప్రదించాలి.

కడుపు ఉబ్బరం :

పశువు కడుపు ఎడమవైపు ఎలాంటి డొక్కు లేకుండా వాచినట్లు కనబడుతుంది. శ్వాసలో వచ్చే మార్పుతో దీనిని గమనించవచ్చు. 500ల గ్రాముల సోడా ఉప్పును తగినంత నీటిలో కలిపి తాగిస్తే తగ్గిపోతుంది. అయినప్పటికీ తగ్గకపోతే 25 గ్రాముల మిరియాల పొడిని లీటరు నీటిలో కలిపి తాగించాలి. కడుపు ఉబ్బరం తగ్గే వరకు పశువుకు మేత వేయకూడదు.

చీటింగ్ కేసులో ఒకరి రిమాండ్

రామకృష్ణాపూర్: ఓ వ్యక్తికి ఇల్లు అమ్మి డబ్బులు తీసుకుని రిజిస్ట్రేషన్ చేయకుండా బెదిరించిన కేసులో గద్దెరాగిడికి చెందిన రౌడీషీటర్ కూనారపు మల్లేశ్‌ను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. రాజ్‌కుమార్ అనే వ్యక్తి వద్ద డబ్బు తీసుకుని రిజిస్ట్రేషన్ చేయకపోవడమే కాకుండా మరోవ్యక్తి రామాంజనేయులు వద్ద కూడా డబ్బులు తీసుకుని రిజిస్ట్రేషన్ చేసి అతనికి భూమి ఎక్కడుందో చూపెట్టకుండా మోసం చేసినందుకు బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

రీ సర్వే నిర్వహించాలని వినతి

రెబ్బెన/ఆసిఫాబాద్‌అర్బన్: బెల్లంపల్లి ఏరియాలో నూతనంగా ప్రారంభించనున్న గోలేటి ఓసీపీలో కోల్పోయే భూములకు సంబంధించిన అవార్డు ఆమోదాన్ని నిలిపివేసి రీ సర్వే నిర్వహించాలని బాధిత రైతులు కలెక్టర్‌ను కోరారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం గోలేటి ఓసీపీ కోసం సేకరించే 58.09 ఎకరాల భూముల విషయంలో సింగరేణి, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సోషల్ ఆడిట్, రీ సర్వేలో తప్పులు జరిగాయని పేర్కొన్నారు. భూముల అవార్డు ఎంక్వైరీ జరిపిన రోజు రీసర్వే చేయాలని ఆర్డీవోకు వినతిపత్రం అందించామన్నారు. అయినా రెవెన్యూ అధికారులు సింగరేణి అధికారులకు వత్తాసు పలుకుతూ మా గోడు పట్టించుకోవటం లేదని వాపోయారు. ఇప్పటికైనా అవార్డు ఎంక్వైరీని నిలిపివేసి సోషల్ ఆడిట్, రీసర్వే నిర్వహించి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో రైతులు చల్లూరి అశోక్, గౌతం, దేవమ్మ, లక్ష్మి, వెంకటేశ్, పోషం, తిరుపతి, విట్టల్ పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న బాధిత రైతులు